## క్లుప్తంగా

### కొనసాగుతున్న నిరవధిక సమ్మె



దౌల్తాబాద్: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల చేస్తున్న సమ్మె సోమవారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వేతనం రూ.19500కు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడి కుర్మని సాయిలు, కార్మికులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ పాలనలోనే పల్లెల అభివృద్ధి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న పాండురంగయ్య

కుల్కచర్ల: బీఆర్ఎస్ పాలనలో పల్లెలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని మరికల్ సర్పంచ్ పాండు రంగయ్య అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలంలోని మరికల్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో గ్రామానికి అవసరమైన వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్లమ్మ, శ్రీను, కృష్ణాజీ, పాండురంగయ్య, వెంకటయ్య, అచ్చప్ప పాల్గొన్నారు.

### నిరుపేదలకు అందుబాటులో ఉంటాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



బాధితులను పరామర్శిస్తున్న రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అండగా ఉంటామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలానికి చెందిన ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన జిల్లెల శ్రీనివాస్, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజుగౌడ్‌లను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నిరుపేదలకు తాము అండగా ఉంటామని, ఎవ్వరు కూడా అధైర్యపడాల్సిన పని లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అంజనేయులు, జిల్లా కార్యదర్శి నర్సింలు, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లెల చంద్రయ్య, షర్ఫొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

### సత్వరమే పరిష్కారం



ఫిర్యాదులు తీసుకుంటున్న కమిషనర్

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 7 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

### ఉచిత హామీలతో మోసం

ఎంఐఎం నాయకుడు ఎస్‌బీ. గుల్షన్

కొడంగల్ రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత హామీలు, ప్రజలను మభ్యపెట్టే వాగ్దానాలు చేస్తూ మోసం చేస్తుందని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మైనార్టీలకు కార్పొరేషన్ రుణాలు ఇస్తామని ప్రకటించడంతో నిరుపేద మైనార్టీ ప్రజలు మీ సేవా కేంద్రాల్లో డబ్బులు వెచ్చించి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకూ అతీగతీ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో సర్వర్ బిజీగా ఉండడంతో రోజుల తరబడి దరఖాస్తు చేసుకోవడానికి తిరగాల్సి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వం నిరుపేద మైనార్టీల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్‌రోమన్, ఎండీ.ముర్తుజా, హుస్సేన్, షేక్ ఆబిద్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ.అజర్, ఎండీ.ముబీన్, ఎండీ. అర్షద్ తదితరులున్నారు.

# వీవీలు రెన్యువల్ అయ్యేనా?



గోకఫసల్‌వాద్ ప్రాథమిక పాఠశాల

- మూడేళ్లుగా విద్యావలంటీర్లను విధుల్లోకి తీసుకోని ప్రభుత్వం
- పెరుగుతున్న స్టూడెంట్స్ సంఖ్య
- టీచర్ల కొరతతో విద్యార్థులకు నష్టం

దౌల్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో ప్రభుత్వం ఏటా విద్యావలంటీర్లను నియమించేది. ఇందుకు వారికి నెలకు గౌరవవేతనం చెల్లించేది. దీంతో విద్యార్థులు తరగతులు నష్టపోకుండా వలంటీర్లకు సైతం ఉపాధి లభించేది. కరోనా నేపథ్యంలో బడులు మూతపడడంతో వలంటీర్లను విధుల్లోకి తీసుకోలేదు. మూడేళ్లుగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఎక్కువగా ఉన్న చోటుకు టీచర్లను డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేశారు. ఈ సారి కూడా సర్దుబాటు చేస్తారా లేదా వీవీలను విధుల్లోకి తీసుకుంటారా వేచి చూడాలి.

**పెరిగిన విద్యార్థుల సంఖ్య**

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్న ఉద్దేశంతో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఫలితంగా పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది. సరిపడా టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోయే అవకాశముంది. మండలంలో ప్రస్తుతం 110 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి స్థానంలో విద్యావలంటీర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఏటా ఎదురుచూపులే..**

ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా టీచర్ల ఉద్యోగ విరమణ, లాంగ్‌లీవ్, ఇతర కారణాల రీత్యా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడుతూనే ఉంటాయి. ఖాళీగా ఉన్న స్థానాల్లో వలంటీర్లను నియమించడానికి ఆదేశాలు వస్తాయని ఎదురుచూస్తున్నారు. అయితే, విద్యాసంవత్సరం పూర్తికాగానే నూతన నోటిఫికేషన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఉన్నాయని వీవీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు ఖాళీలు భర్తీ చేసే వరకు వలంటీర్లను నియమించి తమనే కొనసాగించాలని కోరుతున్నారు.

**విధుల్లోకి తీసుకోవాలి**



తక్కువ జీతమైన రెగ్యులర్ టీచర్లతో సమానంగా విధులు నిర్వహించాం. కరోనా తర్వాత వలంటీర్లను తీసుకోలేదు. రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించే వరకు విద్యావలంటీర్లను కొనసాగించాలి.

–వెంకటేష్, విద్యావలంటీర్, దౌల్తాబాద్

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు**



ప్రభుత్వ పాఠశాలల్లో వీవీల భర్తీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు.. గతేడాది ఖాళీ స్థానాల్లో టీచర్లను సర్దుబాటు చేశాం. ఇప్పుడు కూడా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

# ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాల ఉత్సవాల్లో మహిళాలు

పరిగి: పట్టణంలో పోచమ్మ బోనాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకొని పుర వీధుల గుండా ఆలయానికి చేరుకొని అమ్మవారికి చేసిన నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్,, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

పరిగి: రైతు బీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 59 సంవత్సరాల లోపు ఉన్న రైతులు అర్హులని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, నామినీ, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని దరఖాస్తు పత్రానికి జతచేసి వ్యవసాయ విస్తరణ అధికారికి లేదా రైతు వేదికలో ఇవ్వాలన్నారు. ఈ నెల 20వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

### ఉప సర్పంచ్ తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

సర్పంచ్ కోళ్ల సురేష్



సమావేశంలో మట్లాడుతున్న సర్పంచ్

దోమ: గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల కాకుండా సంతకాలు చేయకపోవడం వంటి పనులతో గ్రామంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోందని బొంపల్లి గ్రామ సర్పంచ్ కోళ్ల సురేష్ అన్నారు. సోమవారం వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్తు దీపాల ఏర్పాటు, మురుగుకాల్వలు, నీటి సరఫరా వంటివి పనులు చేసేందుకు నిధులు విడుదలకు ఉప సర్పంచ్ సంతకం చేయకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గ్రామంలో పండగలు నిర్వహించే సమయంలో కూడా రాజకీయాలు చేయడం సరికాదని పద్ధతి మార్చుకోకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రాము, వార్డు సభ్యులు చంద్రశేఖర్, అనంతమ్మ, మంగమ్మ, యాదగిరి, అనిత, కోఆప్షన్ సభ్యులు పెంటయ్య, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొండయ్య తదితరులు

**టీఎస్‌ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య**

బంట్వారం: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 17,18,19 తేదీల్లో మూడు రోజుల పాటు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన వాల్ సోమవారం బంట్వారం మోడల్ స్కూల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుతో ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ మండల అధ్యక్షుడు వెంకటేశం, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**సీఐటీయూ నాయకుడు మహిపాల్**

అనంతగిరి: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, ఐసీడీఎస్‌కు ప్రమాదకరమైన 2020 నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు వికారాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమాదబీమా రూ. 10 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలను రూ. 26,000 ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. డబుల్ బెడ్ రూం నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ. 10 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసమ్మ, కార్యదర్శి భారతి, వనజ, రేణుక, పుష్ప, లక్ష్మి, శారద, వసంత, పుష్ప, మాణెమ్మ, సుజాత, అన్నపూర్ణ ,ప్రమీల, పద్మావతి, అండాలు, మనోర తదితరులు పాల్గొన్నారు

### ఓటింగ్ ప్రక్రియపై అవగాహన



ఓటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న విజయేందర్

దోమ: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ ఓటింగ్ ప్రక్రియపై అవగాహన పెంపొందించుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ ప్యానల్ వంటి ఓటింగ్ యంత్రాలపై ప్రతి ఒక్కరికి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఓటింగ్ ప్రక్రియపై ఏదైనా అనుమానాలుంటే కార్యక్రమంలో పాల్గొని అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోరింటాకు ఉత్సవం



గోరింటాకు ఉత్సవంలో పాల్గొన్న మంజుల

అనంతగిరి: వికారాబాద్ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢమాసం గోరింటాకు ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టుకొని సంతోషంగా ఆడిపాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, కౌన్సిలర్ గాయత్రి లక్ష్మణ్, మహిళ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత బాలికకు అండగా ఉంటాం



విదార్థినికి నోట్‌బుక్స్ , బ్యాగ్ అందజేస్తున్న యువకులు

**పెద్దేముల్ యూత్ క్లబ్**

పెద్దేముల్: తల్లిదండ్రులను కోల్పోయిన గిరిజన విద్యార్థి చదువుకు అండగా ఉంటామని పెద్దేముల్ యూత్ క్లబ్ యువకులు ముందుకు వచ్చారు. సోమవారం పెద్దేముల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 7వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి రాధిక రాథోడ్‌కు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగు, టిఫిన్ బాక్స్ కిట్టుతో పాటు రూ.6000వేల విలువ చేసే వస్తువులు అందచేయడం జరిగిందని యూత్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. తల్లి సోనిబాయి, తండ్రి బీమ్లానాయక్‌లు అనారోగ్యంతో గత ఏడాది క్రితం మృతి చెందారు. దీంతో రాధిక రాథోడ్ పెద్దేముల్ తండాల్లో ఉన్న అమ్మమ్మ చోలిబాయి వద్ద ఉంటూ చదువుకుంటుంది. విషయం తెలుసుకున్న యూత్ క్లబ్ యువకులు విద్యార్థినికి అండగా ఉంటామని ముందుకొచ్చారు. బాలిక చదువుతో పాటు ప్రతి నెల వారి కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతప్ప, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికాసంతోనే మెరుగైన జీవనం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవిగౌడ్

**ఎస్ఐ రవిగౌడ్**

కొడంగల్ : మానసిక వికాసంతోనే మెరుగైన జీవనం సాధ్యమవుతుందని ఎస్ఐ రవిగౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. రోడ్డు భద్రత డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, డయల్ 100, షీ టీమ్, 181 గురించి వివరించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా 1098, గంజాయి డ్రగ్స్ నిషేధం, 1930 సైబర్ క్రైమ్ పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పరిశుభ్రతతోనే అభివృద్ధి

**ఎంపీడీఓ శేషగిరిశర్మ**



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పరిగి: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శేషగిరిశర్మ సూచించారు. సోమవారం మండలంలోని రాఘవపూర్‌లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఘవపూర్ గతంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా జిల్లాస్థాయిలో ఎంపిక కావడం జరిగిందన్నారు. ప్రస్తుతం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పథకం కింద ఎంపిక అయిందన్నారు. కావునా గ్రామస్తులందరూ ప్రతివీధిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలు పట్టణాలకు సమానంగా అభివృద్ధి కావాలనే స్వచ్ఛ సర్వేక్షణ్ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగన్, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ మోడుబారిన చెట్ల పరిశీలన**

తాండూరు: తాండూరు పట్టణంలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగిస్తామని అటవీశాఖ తాండూరు రేంజ్ అధికారి శ్యాంసుందర్‌రావు అన్నారు. తాండూరు డీఎస్పీ కార్యాలయంలో ఉన్న భారీ వేపచెట్టు ఎండుతెగులు సోకి ఎండిపోయింది. ఎండిన చెట్టు వల్ల ప్రమాదం పొంచి ఉందని పోలీసు అధికారి అటవీశాఖ అధికారులకు విన్నవించారు. దీంతో తాండూరు డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని ఎండిపోయిన చెట్టును పరిశీలించారు. అలాగే, పట్టణంలోని సింధు జూనియర్ కళాశాల రోడ్డు పక్కన, బస్ స్టేషన్ సమీపంలో ఎండిపోయిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ..పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులు వెళ్తున్న క్రమంలో చెట్లు కూలిపోయి ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. ఎండిపోయిన చెట్లను గుర్తిస్తున్నామని, రెండు రోజుల వ్యవధిలో ఎండిపోయిన చెట్లను తొలగిస్తామన్నారు.

**◆ చిరునవ్వు చెరగనివ్వం: ఎస్ఐ శంకర్**

బొంరాస్‌పేట: చిన్నారుల ముఖాల్లో చిరునవ్వు చెరగనివ్వమని ఆపరేషన్ ముస్కాన్ బృందం, అధికారి, బొంరాస్‌పేట ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పరిగి సబ్‌డివిజన్ బృందం ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం పరిగిలోని పలు దుకాణాల్లో, కార్ఖానాల్లో తనిఖీలు చేశారు. ఈమేరకు ఏ1 ఫ్రెష్ యజమాని రూప్‌ఖాన్‌పేటకు చెందిన ఎండీ మంజూర్ చికెన్ సెంటర్‌లో ఓ బాలుడు మూడు నెలలుగా పనిచేస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇలాంటి విషయాలపై తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాలల భవిషత్తుకు బంగారు బాటలు వేయాలని ఎస్ఐ సూచించారు.

**◆ మొక్కలు నాటి సంరక్షించాలి**

కుల్కచర్ల: మొక్కలు నాటడంతో పాటుగా వాటిని సంరక్షించడాన్ని బాధ్యతగా భావించాలని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ నరేష్, బీఆర్ఎస్ నాయకులు సోమలింగం అన్నారు. సోమవారం మండలంలోని పీరంపల్లిలో నాటిన మొక్కలకు ముళ్లకంచె(ట్రీగార్డ్)లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిధిలోని మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ జంబు వెంకటయ్య పాల్గొన్నారు.

**◆ ప్రజావాణికి రెండు ఫిర్యాదులు**

బంట్వారం: ప్రజావాణికి రెండు ఫిర్యాదులు అందాయి. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదులను స్వీకరించారు. వెంటనే మీసేవా కేంద్రంలో దరఖాస్తు పెట్టించారు. ధరణికి సంబంధించిన అర్జీలే ఎక్కువగా వస్తున్నాయని, రికార్డులు సరి చూసి ధరణిలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని తహసీల్దార్ రైతులకు వివరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**◆ బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత**

బంట్వారం: మండలంలోని బొప్పునారం గ్రామానికి చెందిన ఆనంద్ తన ఫోన్ పోగొట్టుకున్నాడు. ఇటీవల బంట్వారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా లభించిన వివరాలతో సోమవారం సదరు వ్యక్తికి సెల్‌ఫోన్‌ను అందజేశారు.

**◆ చదువుతోనే సమాజంలో గుర్తింపు**

**సర్పంచ్ శ్రావణ్ కుమార్**

పెద్దేముల్: చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు ఉంటుందని సర్పంచ్ శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మంబాపూర్ పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌యంసీ చైర్మన్ యేసు, ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, ఉపాధ్యాయులు చంద్రయ్య, ఊర్వశి, బాలమణి, ప్రభు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**◆ 13, 14న స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల ఎంపిక**

వికారాబాద్ అర్బన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ (హకీంపేట్, కరీంగనర్, ఆదిలాబాద్)లో ప్రవేశాలకు జిల్లా స్థాయిలో బాల బాలికలను ఎంపిక చేయనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లో ఈ నెల 13న 4వ తరగతికి, 14న 5వ తరగతి విద్యార్థుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఎంపికైనా వారికి 27, 28వ తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపికలు హకీంపేట్‌లో ఉంటాయన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు.

**◆ పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి**

కుల్కచర్ల: వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం కుల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలో పలు కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల పరిసరాలల్లో పాత టైర్లలో, కొబ్బరిబోండలలో, కుండలు, గోళాలు వంటి వాటిలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నిల్వ ఉండం వల్ల దోమలు, ఈగలు గుడ్లు పెట్టి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.